క్లుప్తంగా

శతాబ్ది ఉత్సవాలకు తరలిరావాలి

మోపిదేవి: గుంటూరు జిల్లా లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాలకు రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఘంటసాల కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత అన్నారు. ఈనెల 31వ తేదీన గుంటూరు లాంఫాంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో కృష్ణా జోన్‌లోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలు పాల్గొని ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెడన: వివాహిత అదృశ్యంపై ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన వైఎస్సార్ కాలనీకి చెందిన యువతి (22)కు గత ఫిబ్రవరి 23న వివాహం చేశారు. ఈ నెల 28న ఉదయం ఆమె జిరాక్స్ తీయించుకుని వస్తానని చెప్పి వైఎస్సార్ కాలనీలోని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లోను, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

5న లంకమ్మ వార్షిక జాతర

అవనిగడ్డ: దివిసీమ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర పోస్టర్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ఆవిష్కరించారు. స్థానిక శాసన సభ్యుని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన అమ్మవారి ప్రధాన జాతర జరుగుతుందని తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ గ్రామ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ(చిన్నా) ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కోడూరులో 'ఆసరా' పంపిణీ

కోడూరు: ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందిన మహిళలకు మండల స్థాయి నగదు చెక్కు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తామని ఏపీఎం టి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని 1,006 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.10.46 కోట్ల చెక్కును మహిళలకు అందిస్తారని చెప్పారు.

ఉప సర్పంచ్ వనసత్యనారాయణ మృతి



బంటుమిల్లి: సాతులూరు పంచాయతీ ఉప సర్పంచ్ చదలవాడ వన సత్యనారాయణ (45) బుధవారం మృతిచెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆయన కార్యకర్తగా పనిచేశారు. రెండు రోజుల కిందట గ్యాస్ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గుండె సంబంధిత వ్యాధిగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. బుధవారం ఆయన మృతిచెందారు. వన సత్యనారాయణ మృతదేహాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ వి. చినబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, సర్పంచ్ జి. బాలస్వామి, మంత్రి తనయుడు జోగి రాజీవ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం. రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: నగరంలో గురువారం నిర్వహించనున్న శ్రీరామ శోభాయాత్రను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. స్థానిక మహతి కల్యాణ మండపం వద్ద బుధవారం రాత్రి శ్రీరామ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులు ఆవిష్కరించి మాట్లాడారు. హిందూ కళాశాల వద్ద మధ్యాహ్నం 3.30 గంటలకు యాత్ర బయలుదేరుతుందని వివరించారు.

వ్యవసాయ శాఖాధికారిని కలిసిన నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల జిల్లా వ్యవసాయశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన విజయభారతిని బుధవారం రైతు భరోసా కేంద్రం ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఎం. కల్యాణ్, నాగేశ్వరరావు, ప్రవీణ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థిక ప్రగతే లక్ష్యం

మూడో విడత నిధుల పంపిణీలో మంత్రి జోగి రమేష్

గూడూరు: స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల విడుదలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గూడూరు మండలం కప్పలదొడ్డిలో బుధవారం డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించాడని, ఫలితంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలు వడ్డీతో సహా అప్పులు చెల్లించాల్సిన దుస్థితి వచ్చిందని గుర్తుచేశారు. జగనన్న పాదయాత్రలో డ్వాక్రా అక్కచెల్లెమ్మల కష్టాలు కళ్లారా చూసిన జగనన్న అధికారంలోకి రాగానే ఎన్నికల నాటికి బకాయి ఉన్న అప్పును నాలుగు విడతల్లో వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల విడుదల చేశారన్నారు. కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, గంగ్రం, రామానుజవత్తర్లపల్లి, లేళ్లగరువు, ముక్కొల్లు, పోసినవారిపాలెం గ్రామాల్లోని 322 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,347 మంది మహిళలకు రూ.2 కోట్ల 23 లక్షల 65 వేల 668 పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వైఎస్సార్ ఆసరా నిధులతో డ్వాక్రా మహిళలు ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయాలని మంత్రి కోరారు. తొలుత సభా వేదికపై ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిమకు మంత్రి జోగి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు.



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

ప్రారంభోత్సవాలు..

కప్పలదొడ్డి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22.80లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బీవీ ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.



కప్పలదొడ్డిలో ఆసరా చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

జగన్ పేదలకు ఇస్తుంటే.. చంద్రబాబు తనవారికి దోచిపెట్టాడు..

చల్లపల్లి: రాష్ట్ర బడ్జెట్ నిధులను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదల సంక్షేమ పథకాలకు, రాష్ట్ర అభివృద్ధికి వెచ్చిస్తుంటే, ఇదే బడ్జెట్‌లో నిధులను చంద్రబాబు టీడీపీ ప్రభుత్వంలో తన వారికి దోచిపెట్టారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సభ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో కూడా ఇదే బడ్జెట్ ఉన్నప్పటికీ పేదలకు పెట్టే మనసు చంద్రబాబుకు లేదన్నారు. కోటికి కొన్న ఎకరం వంద కోట్లు అవ్వాలని ఆశించే వారికి కొమ్ము కాసి అమరావతి పేరుతో చంద్రబాబు పేదల సంక్షేమాన్ని అటకెక్కించారని విమర్శించారు. గత ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ఈసారి ప్రజల్లోకి వెళుతున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం చల్లపల్లి మండలంలోని 912 స్వయం సహాయక సంఘాలకు చెందిన 9,077 మంది డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, రైతు విభాగం రీజనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తెనాలి ఇందిర, ఏరియా కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏపీఎం సీహెచ్‌వీవీ బాపనయ్య, ఎంపీడీఓ అరుణ కుమారి, తహసీల్దార్ కే.గోపాలకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

నాగాయితిప్ప(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాగాయితిప్ప సచివాలయం వద్ద డ్వాక్రా సంఘాల మహిళలు బుధవారం క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఏపీఎం శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లింగం జగదీష్ కుమార్, వీఓ కల్యాణి, బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి డీబార్

పెడన: పట్టణంలోని శ్రీవిజయానంద కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష చివరి రోజున ఒక విద్యార్థి కాపీ చేస్తూ పట్టుబడటంతో డీబార్ చేశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎంపీ రమణరావు తెలిపిన వివరాల మేరకు కామర్స్ పరీక్ష రాస్తున్న సప్లమెంటరీ విద్యార్థి పట్టుబడటంతో డీబార్ చేశామన్నారు. బుధవారం 301 మందికిగాను 296 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

రూ. 149.57 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ 2023–24 సంవత్సరానికి రూపొందించిన రూ. 149.57 కోట్ల బడ్జెట్‌ను బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్‌లో పేర్కొన్న ప్రారంభ నిల్వ రూ. 18.02 కోట్లు కాగా, ఆదాయం రూ. 142.73 కోట్లు, ముగింపు నిల్వ రూ. 11.19 కోట్లుగా రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. 2022–23 సవరించిన బడ్జెట్ అంచనాల్లో ప్రారంభ నిల్వ రూ. 11.21 కోట్లు, ఆదాయం రూ. 64.23 కోట్లు, వ్యయం రూ. 54.41 కోట్లు, ముగింపు నిల్వ రూ. 21.02 కోట్లుగా చూపగా దీనిని కౌన్సిల్ ఆమోదించింది. ఈ బడ్జెట్‌లో పలు పద్దుల కింద పనులకు, అభివృద్ధి పనులకు వివిధ విభాగాలకు, పనుల నిర్వహణకు, ఇతర ఖర్చులకు చేసిన కేటాయింపులను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

అంచనాలపై అవగాహన లేకుండా చర్చకు పెట్టిన టీడీపీ సభ్యులు..

బడ్జెట్ అజెండాలో పలు పద్దులకు కేటాయించిన అంచనాలపై టీడీపీ సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో పలు అంశాలపై లేనిపోని ప్రశ్నలు సంధించి పలుమార్లు అధికార పక్ష సభ్యులను తప్పుపట్టారు. బడ్జెట్ అంచనాలను చదువుతున్న సమయంలో పదే పదే అడ్డుతగులుతూ అసందర్భ ప్రశ్నలు వేశారు. నగరంలో ఆశీలు వసూలు చేస్తే రూ. 70 లక్షల ఆదాయం వస్తుందని, దీనికి అధికార పక్షం అడ్డుకుంటోందని టీడీపీ సభ్యుడు రాము ఆరోపించారు. అధికార పక్ష సభ్యుడు మేకల సుబ్బన్న బదులిస్తూ కోవిడ్ కారణంగా నగరంలోని సుమారు ఎనిమిది వేల మంది చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) వారిపై ఆశీల భారం లేకుండా చేశారని, దీనిని రాజకీయం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మీ డివిజన్లలో ఇంటింటికి వెళ్లి చిరు వ్యాపారులకు ఆశీల పన్ను విధించాలని ప్రచారం చేయాలని రాముకు సుబ్బన్న సూచించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కమిషనర్ చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఎంఈ శ్రీకాంత్, ఎంహెచ్ఓ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ

రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధి

నగరాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్క కార్పొరేటర్ కృషి చేయాలని మేయర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. రెండేళ్లుగా అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి దిశగా పయనింపజేస్తున్నామని, దీని కన్నా రెట్టింపు ఉత్సాహంతో నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చొరవతో నగరం అభివృద్ధి చెందుతోందన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

మంత్రి జోగి రమేష్

పెడన: ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని, ఆ దిశగా పెడనలో సమగ్ర మంచినీటి పథకానికి పనులు ప్రారంభించుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక బంగ్లా స్కూల్ వద్ద రూ.58.23 కోట్లతో చేపట్టిన సమగ్ర మంచినీటి పథకం పనులను మంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభించి మాట్లాడారు. పెడనలో తాగునీటి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా సీఎం ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏఐఐబీ) నిధులు రూ.58.23 కోట్లు విడుదల అయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సుమారు 15 కిలో మీటర్లు పొడవున పైపులైన్ల నిర్మాణాలు చేపట్టామరు. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు స్థానంలో కొత్తది నిర్మిస్తారన్నారు. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ నుంచి వచ్చే పైపులైన్‌కు ఎస్ఎస్ ట్యాంకు వద్ద సంపు నిర్మాణం చేపట్టనున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మొదటి దశ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జోగి రమేష్

మంత్రిని కలిసిన ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీ

పెడన: మంత్రి జోగి రమేష్‌ను ఎన్టీఆర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. రజని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీడీ మాట్లాడుతూ మచిలీపట్నంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు డెప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చిందన్నారు. ఎన్టీఆర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీగా పోస్టింగ్ ఇచ్చారని మంత్రికి వివరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ గరికిపాటి శ్రీదేవి, జి. కొండూరు జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

నవమి శోభ

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

పెడన: శ్రీరామ నవమికి రామాలయాలు, హనుమంతుని ఆలయాలు ముస్తాబయ్యాయి. పలుచోట్ల ఉత్సవాల నిర్వాహక కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని దంపతులచే జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. పెడన బస్టాండ్ వద్ద సీతారామాంజనేయస్వామి వారి ఆలయం, కేడీసీసీ బ్యాంక్ సమీపంలోని కోదండ రామాలయం, తోటమూల హనుమాన్ ఆలయం, మండలంలోని పలు రామాలయాల్లోను నవమి వేడుకలు జరుపనున్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

మచిలీపట్నంటౌన్: నగరంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహణకు పలు ప్రాంతాల్లో భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రుస్తుంబాదలోని భద్రాద్రి రాముల వారి ఆలయంలో స్వామివార్ల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయానికి రంగులు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు కూడళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. లక్ష్మీ టాకీసుసెంటర్‌లోని కోదండ రామాలయం, బస్టాండ్ సెంటరు వద్ద ట్యాక్సీ స్టాండ్ నిర్వాహకులు, నారకొట్ల వీధిలో సీతారామ ఆలయం వద్ద చలువ పందిళ్లు, కోనేరుసెంటర్‌లో పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. లక్ష్మీ టాకీస్ సెంటర్‌లోని వైకుంఠ రామాలయం వద్ద జరిగే సీతారాముల కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పీటలపై కూర్చుంటారని రెండో డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్ తెలిపారు.



బందరు ట్యాక్సీ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి



పెడనలో సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి

ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు దాతలు ఎగ్జామ్ ప్యాడ్లు అందించారు. బుధవారం జరిగిన స్కూల్ వార్షికోత్సవంలో 1990–91 బ్యాచ్ విద్యార్థులు, తెలుగురావుపాలెం ఇమ్మానియేల్ చర్చి పాస్టర్ ఎర్రగుంట షాలెంరాజు ఆర్థిక సాయంతో స్కూల్‌లోని 52 మంది పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు అందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షల భయాన్ని వీడాలి

మోపిదేవి: విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల సంక్షేమ పాఠశాల కార్యదర్శి ఎ. కృష్ణమోహన్ అన్నారు. మోపిదేవి గురుకుల పాఠశాలను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులను అభినందించారు. ఏప్రిల్ 21 వరకు సీనియర్ ఇంటర్ తరగతులకు హాజరై పాఠ్యాంశాలు వినే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ విద్యార్థులకు సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో పది పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షల్లో మెలకువలు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఐదో తరగతి ప్రవేశాలకు బాలికలకు మచిలీపట్నం, బాలురకు మోపిదేవి బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఏప్రిల్ 4వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ యాక్టు తెలుసుకుని మాట్లాడండి

ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్

పెడన: సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మున్సిపల్ యాక్టు తెలుసుకుని మాట్లాడాలని ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ అన్నారు. ప్రతి అంశానికి అడ్డుతగిలితే ఎలా అని జనసేన కౌన్సిలర్ శివపార్వతిని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి అధ్యక్షతన కౌన్సిల్‌హాల్‌లో బుధవారం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి దిశగా నడిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కృషి చేస్తున్నారన్నారు. వారి పూర్తి సహకారంతో కౌన్సిల్ సమన్వయంతో పట్టణాభివృద్ధికి తోడ్పాటు నిద్దామన్నారు. అనంతరం అజెండాలోని 16 అంశాలపై చర్చ ప్రారంభం కాగా మొదటి అంశానికి శివపార్వతి అడ్డుపడ్డారు. ఆశీలు వేలం పాటలకు సంబంధించి కోర్టు స్టే ఇచ్చినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆ అంశాన్ని ఏవిధంగా అజెండాలో పొందుపరిచారంటూ ప్రశ్నించారు. ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ వార్తలలో రావడం కాదని, లిఖిత పూర్వకంగా మున్సిపల్ అధికారులకు అందాల్సి ఉంటుందన్నారు. ఇంకా అందకపోవడం వల్ల అజెండాలో అంశాన్ని పెట్టామన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి

మున్సిపల్ కమిషనర్ అద్దె కారు రానున్న ఏడాదికి కేటాయింపులపై కూడా సదరు కౌన్సిలర్ అడ్డుపడటంతో జీఓ కాపీలను తీసుకువచ్చి చూపించాలని కమిషనర్ ఎం. అంజయ్య ఆదేశించడంతో సీనియర్ అసిస్టెంట్ ఆయా జీఓలను తీసుకువచ్చి చూపారు. అనంతరం పలు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మచిలీపట్నంటౌన్: 40వ డివిజన్‌లో అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న మాగంటి చింతయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1.80 లక్షల చెక్కును వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్న మాగంటి చింతయ్య భార్యకు ఈ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ల నాగరాజు, తరకటూరి సీతారామయ్య, పల్లెం కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. జవ్వారుపేట వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను హిందూ విద్యాసంస్థల కార్యదర్శి దైతా గోపాలకృష్ణశాస్త్రి ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. 5 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు రోబోటిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం, కంప్యూటర్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, మాక్ పార్లమెంట్ తదితర అంశాలపై సుమారు 150కు పైగా ప్రదర్శనలను ఉంచారు. విద్యార్థులను గోపాలకృష్ణశాస్త్రి అభినందించారు. హిందూ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నగరంలోని ఈకే బాలభాను విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 150 ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన అంశాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న గోపాలకృష్ణశాస్త్రి

లక్ష్మీ అన్నపూర్ణమ్మ సేవలు ఆదర్శం

అవనిగడ్డ: వాణి ఓరియంటల్ స్కూల్ నిర్వహణతో పాటు పలు పదవుల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన దివంగత మహిళా సమాఖ్య వీఓ మద్దూరి అన్నపూర్ణమ్మ సేవలు ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆమె స్వగృహం వద్ద బుధవారం అన్నపూర్ణమ్మ సంస్మరణ సభ జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, పలువురు ప్రముఖులు అన్నపూర్ణమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రముఖ కవయిత్రి సింహాద్రి పద్మ, నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరరావు, ఎస్ఆర్ఐ వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. వెంకటేష్, మత్తి శ్రీనివాసరావు, న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్–2 వీఆర్వో ప్రొబేషన్‌కు చర్యలు తీసుకోవాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్–2 వీఆర్వోల ప్రొబేషన్‌కు చర్యలు తీసుకోవాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ పి. రంజిత్‌బాషాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మిరియాల లక్ష్మీనారాయణ, గోపాలకృష్ణ, కొడాలి సందీప్, శీలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకపల్లిలో పేకాట శిబిరంపై ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,120 నగదును స్వాధీనం చేసుకున్నారు.

బోడగుంటలో ఇద్దరు..

మోపిదేవి: మండల పరిధిలోని బోడగుంట సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1,140 స్వాధీనం చేసుకున్నామని మోపిదేవి స్టేషన్ ఎస్ఐ పద్మ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

పోయినవి

మచిలీపట్నం ఈడేపల్లి డోర్ నెం: 17/267 Govada jeesch priesty S/o. G.J.W. Ratnaiah అను నాకు చెందిన ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ 1999 [illegible] చెందిన రిజిస్టర్ నెం : 1039940 మా ఇంటి వద్ద నుంచి జిల్లా కోర్టు సెంటర్‌కు వెళుతున్న మార్గమధ్యలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును. సంప్ర : 8686758551